క్లుప్తంగా

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీమంత్రి



గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌కు చెందిన లచ్చగౌడ్ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం గ్రామంలోని బాధిత ఇంటికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయనవెంట మాజీ సర్పంచు వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ శేఖర్, ఏషమోని శేఖర్, రాచాలశ్రీను, లక్ష్మయ్య ఉన్నారు.

సీపీఐది వందేళ్ల చరిత్ర

వనపర్తి రూరల్: ప్రజాపోరాటాల్లో సీపీఐకి వందేళ్ళ చరిత్ర ఉందని మరే రాజకీయ పార్టీకి ఇంత ఘనచరిత్ర లేదని జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో 4వ రాష్ట్ర మహాసభల గోడపత్రికకు ఆయన ఆవిష్కరించారు. ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌లో 1925, డిసెంబర్ 26న అవిర్భవించి అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, చిన్న కురుమన్న, జయమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లేట్ల అందజేత

పాన్‌గల్: మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు అందజేశారు. ఇటీవల ఇదే పాఠశాలల్లో పదవీ విరమణ చేసిన హెచ్‌ఎం నారాయణ గురువారం ఎంఈఓ శ్రీనివాసులు, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్ చేతులమీదుగా స్టీల్‌ప్లేట్లను పంపిణీ చేశారు. రూ.8వేల విలువైన 80 ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిటైర్డు హెచ్‌ఎంను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూర్వవిద్యార్థులు రూ.10వేల విలువైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌సాగర్, రామస్వామి షూ,టై, బెల్టులు, ఐడెంటీ కార్డులను గురువారం ఎంఈఓ శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తిరుమల్‌యాదవ్, యుగంధర్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు గురువారం అదే గ్రామానికి చెందిన సైన్స్ ఉపాధ్యాయులు బత్తుల విజయ్‌కుమార్, రమేశ్ పాఠశాలలో టై, బెల్టులను సమకూర్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ నరసింహ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుక్కశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు భానుప్రకాష్, శ్రీలత, పూర్ణిమ పాల్గొన్నారు.

యూనిఫాంల పంపిణీ

అమరచింత: యూనిఫాంలను మెప్మా ఆధ్వర్యంలో గురువారం ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్‌లకు అందించారు. మొదటి విడతగా పాఠశాల ప్రారంభంలో అందించినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ యువరాజు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

అభిమానులకు అన్నదానం

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని శ్రీరామ థియేటర్‌లో వార్–2 సినిమా విడుదల సందర్భంగా ఎన్టీఆర్ ఫ్యాన్ అసోసియేషన్ తరఫున సుమారు 2వేల మందికి పైగా అన్నదానం చేసినట్టు అభిమాన సంఘం నాయకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

గోపాల్‌పేట: మండలకేంద్రంలో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మండల ఇంచార్జి కదిరెమధు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి సమక్షంలో కాలనీల్లో తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతలరం బస్టాండ్ సమీపంలోని కాలనీలో వర్షం నీటిలో వలవేసి నిరసన తెలిపారు. చాకలిపల్లి వెళ్లే దారిలో రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, సీనియర్ నాయకుడు అశోక్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ శివ, వామన్‌గౌడ్, నాగరాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

అమరచింత: రైతులకు యూరియాను అధిక ధరలకు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుని షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని ఏడీఏ దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని అగ్రోసేవా కేంద్రం ద్వారా రైతులకు అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం అగ్రోసేవా కేంద్రాన్ని సందర్శించి గురువారం యూరియాను కొనుగోలు చేసిన రైతుల వివరాలను రిజిస్టర్ ప్రకారం సమోదు చేసుకున్నారు. వ్యక్తిగతంగా రైతులకు ఆయన ఫోన్ చేసి యూరియాను ఎంతకు కొన్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు నెలలకు సరిపడా నిమిత్తం యూరియా వివరాలను జిల్లా కార్యాలయానికి నివేదించామన్నారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ : ఖానపూర్‌లో నీటిమునగిన వరిపంట



వనపర్తి మండలం అంకూరు సమీపంలో వరద ఉధృతితో ఆగిపోయిన రాకపోకలు



పాన్‌గల్ : కేతేపల్లిలో వాహనాల ఇబ్బందులు



చిట్యాల దగ్గర కాలువ తెగడంతో నీటిలో మునిగిన పంటపొలాలు

వర్షం ముంచెత్తింది



ఆత్మకూర్: మూలమల్లలో మునిగిన వరిపంట



ఆత్మకూర్: కత్తేపల్లిలో నీట మునిగిన వరిపంట

సాక్షి నెట్‌వర్క్: ఆత్మకూర్ మండలంలో వాన జోరందుకుంది.. భారీ వర్షం ఎడతెరపిలేకుండా కురుస్తుండడంతో అంతా అతలాకుతలంగా మారింది. మూలమల్ల, ఖానాపూర్, కత్తేపల్లి గ్రామాల్లో వర్షం నీటికి వరిపంటలు పూర్తిగా నీట మునిగాయి.

■ ఉమ్మడిగోపాల్‌పేట మండలంలో వాగులు, వంకలు, చెరువులు, పలుకాలనీలు ఉప్పొంగాయి. కేశంపేట వాగువద్ద రాకపోకలు బంద్ అయ్యాయి. తాడిపర్తి చెరువు అలుగు పారడంతో బారికేడ్లు వేశారు.

■ వనపర్తి రూరల్: వనపర్తి మండలంలో బుదవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని వెంక టాపురం, చిమనగుంటపల్లి చెరువులు, చిట్యాల చెరువులు కుంటలు నిండి పొంగి పొర్లాయి. అంకూర్ దగ్గర రోడ్డుడ్యాంపై నుంచి ప్రమాదస్థాయిలో నీరుపారటంతో వాహనాల రాకపోకలకు నిలిచిపోయి.

■ ఖిల్లాఘనపురం మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వాన కురిసింది. జిల్లాలోనే అత్యధికంగా 107.4 ఎంఎంల వర్షా పాతం నమోదైనట్లు అధికారులు ధృవీకరించారు. అప్పారెడ్డిపల్లి నుంచి ఖిల్లాఘనపురం వెళ్లే రోడ్డు, వెంకటాంపల్లి నుంచి కమాలొద్దీన్‌పూర్, ఆగారం వెళ్లే రోడ్లపై వాగులు పాగి పారడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.మండలంలో కమాలొద్దీన్‌పూర్‌లో 3 ఇండ్లు, ఖిల్లాఘనపురంలో 2, మల్కిమియాన్‌పల్లి 2, మానాజీపేట గ్రామంలో 1 కూలిపోయాయి. ప్రభుత్వానికి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



పాన్‌గల్: గోప్లాపూర్‌లో అలుగు పారుతున్న సబ్బినేని చెరువు



ఖిల్లాఘనపురంలో కూలిన ఇల్లు



ఏదుల వెళ్ళే దారిలో పర్యవేక్షిస్తున్న రేవల్లి ఎస్సై రజిత, తహసీల్దార్ లక్ష్మీదేవి, సిబ్బంది



వెంకటాంపల్లి వాగు వద్ద అడ్డంగా ప్రమాద సూచిక



ఖిల్లాఘనపురం అప్పారెడ్డిపల్లి వద్ద అడ్డంగా కంపవేస్తున్న సిబ్బంది



పాన్‌గల్ క్రేతేపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు



ఖిల్లాఘనపురం మండలం పిల్లివాగు సమీపంలో పంటపొలాల పై పారుతున్న నీళ్ళు



పాన్‌గల్‌లో అలుగు పారుతున్న పొల్కి చెరువు

యూరియా కొరత లేకుండా చూడాలి



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్లు, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపు యజమానులు య్యూరియా కోసం ఎప్పటికప్పుడు, డబ్బులు కట్టి తెప్పించుకోవాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టర్ జిల్లా కేంద్రంలో పీఏసీఎస్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గోదాములో ఉన్న యూరియా నిల్వలు, బయట సూచికబోర్డుపై రాసి పెట్టిన నిల్వల వివరాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, గిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర రావు, ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

ఉధృతంగా ప్రవహిస్తున్న రోడ్డు నుండి పాదచారులు, వాహనాలు దాటే ప్రయత్నం చేయవద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వాగులు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో కలెక్టర్ గురువారం అంకూర్ గ్రామం వద్ద వాగు ఉధృతిని పరిశీలించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



శ్రీ రంగాపురంలో ర్యాలీలో బీజేపీ నాయకులు



పిన్నంచర్లలో బీజేపీ శ్రేణులు

వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం పట్టణంలో మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పట్టణకేంద్రంలో హర్‌గర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, మండల ఇంచార్జి రాఘవేందర్‌గౌడ్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శెట్టి రాజులశివ, చరణ్ విరాట్, రాజేష్, నరేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: హర్‌ఘర్ తిరంగాలో భాగంగా మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో ఇంటింటి పై జాతీయ పతకాలను ఏర్పాటు చేశారు. గురువారం బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, అశోక్‌జీ, రేచింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు రాధాకృష్ణుల వేషాధారణలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ పద్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు, సీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.



రాధాకృష్ణుల వేషాధారణలో విద్యార్థులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి రజిని

వనపర్తి విద్యావిభాగం: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రజినీ అన్నారు. గురువారం జిల్లాలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా కళాశాలలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ను ఏర్పాటు చేయాలని, కమిటీ సభ్యుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలని సూచించారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పుష్పలత, ప్యానల్ అడ్వకేట్ ఉత్తరయ్య, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌యాదవ్, ప్రొఫెసర్ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

అదుపుతప్పి బైక్ బోల్తా.. వ్యక్తి దుర్మరణం

కొత్తకోట రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కొత్తకోట మండలం రాయిణిపేట గ్రామానికి చెందిన జగదీశ్వర్‌రెడ్డి అడ్డాకుల మండలం కాటారం గ్రామ శివారులో గల మైనింగ్ కంపెనీలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తుండేవాడు. జగదీశ్వర్‌రెడ్డి భార్య ప్రశాంతి, ఇద్దరు కుమారుతో జిల్లా కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. విధి నిర్వహణలో భాగంగా వనపర్తి నుంచి మైనింగ్ కంపెనీలో పనిచేసేందుకు వెళ్లాడు. పని ముగించుకుని బుధవారం రాత్రి అక్కడి నుంచి వనపర్తికి బైక్‌పై వెళ్తుండగా వర్షం కారణంగా రాజపేట సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో అటుగా హైదరాబాద్ వెళ్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డి గమనించి గాయపడిన జగదీశ్వర్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న జగదీశ్వర్‌రెడ్డి మధ్యరాత్రి మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం రాణిపేట గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ మృతి..

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలోని అయిజయ్య నగర్ కాలనీకి చెందిన మహిళ మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని అయిజయ్య నగర్ కాలనీకి చెందిన ఆంగోతు లక్ష్మి(56) మానసిక రోగంతో బాధపడుతూ ఈ నెల 10న ఇంటిని శుభ్రపరిచే లైజాల్‌ను తాగడంతో తన కుమారుడు చూసి వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకొని పోగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధాహ్నం మృతి చెందింది. మృతురాలు అన్న జయరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడు ప్రమాదంలో వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: జాతీయ రహదారిపై కారు, లారీని ఢీ కొనడంతో లారీ అదుపుతప్పి బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రంగాపురం దగ్గర చోటుచేసుకుంది. పెబ్బేరు ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల్ పట్టణంలోని చేరెల్లి కాలనీకి చెందిన మహ్మద్ మసూద్ గద్వాల్ నుంచి లారీలో యూరియా బస్తాలను తీసుకొని కొత్తకోటకు వెళ్తుండగా గురువారం తెల్లవారు జామున పెబ్బేరు మండలం, రంగాపురం దగ్గర అదే దారిలో కారు అతివేగంగా వచ్చి లారీ ముందు కుడివైపు టైరుకు ఢీ కొట్టడంతో లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టి లారీ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవరు తమ్ముడు ఎండీ మహబూబ్(22) తలకు బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి అన్న మహ్మద్ మసూద్ పోలీస్‌స్టేషన్‌లో కారు డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

పంట పొలాల పరిశీలన

అమరచింత: వర్షాలకు నీటి మునిగిన పంట పొలాలు అధికారులు సందర్శించారు. ఖానాపురంలో వరిపంట వరదనీటిలో మునిగిపోయింది. రైతులు ఆదుకోవాలని కోరడంతో, ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు ఏఓ అరవింద్ తెలిపారు.

వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామంలోని వీరసముద్రం చెరువు కట్ట మరమ్మతులను గురువారం తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ రవి నారాయణ పరిశీలించారు.

కొత్తకోట రూరల్: వర్షాలకు పంటలు రక్షించుకునేందుకు అప్రమత్తం చేసేందుకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. రాయిణిపేట గ్రామంలో పంటలను జాస్మీన్ పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న ఆలయ భూమిపూజ

అమరచింత: పట్టణంలోని ఆంజనేయ ఆలయ నూతన నిర్మాణ పనులకు దేవాదాయశాఖ ద్వార రూ.50లక్షల నిధులను మంజూరు చేశామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం ఆలయ పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. మాజీ అడ్వకేట్ దేశాయి ప్రకాష్‌రెడ్డి దంపతుల చేత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీచైర్మన్ రజనీసాయిచంద్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి, డీఎస్‌పీ రవీందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, రమేష్, ఎకే.వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్‌చైర్మన్ రహమతుల్లా, డీసీసీ ప్రధానకార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌లు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

యూరియా సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

అమరచింత: సకాలంలో రైతులకు యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని రైతు ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని పత్రికా ప్రకటనలు చేస్తున్నదే తప్పా ఆచరణలో విఫలం అయ్యిందన్నారు. ముందస్తుగా రాష్ట్రానికి ఎంతమేరకు యూరియా, ఫర్టిలైజర్ అవసరాలు ఉంటాయనే విషయాలను అంచనా వేయకుండానే దిగుమతి చేసుకున్నామని చెప్పుకోవడం అవివేకమన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి తన నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో యూరియా సరఫరా గురించి తెలుసుకోలేక పోవడం వింతగా ఉందన్నారు. ఎంపీ డీకె అరుణ కేంద్ర ప్రభుత్వం ద్వారా కేవలం అమరచింతకు తాగునీటి కోసం రూ.13కోట్లు మంజూరు చేశారని, మంత్రి ఎన్ని నిధులు తెచ్చారో ప్రజలకు బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. యూరియాను సకాలంలో సరఫరా చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రాబోయే స్థానికఎన్నికల్లో అమరచింత, ఆత్మకూర్, మక్తల్ మున్సిపాలిటీలను బీజేపీ కైవసం చేసుకునేలా పార్టీని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మంగలావణ్య, నాయకులు మేర్వరాజు, మరాఠి అశోక్, క్యామ భాస్కర్, విజయ్‌యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, వినోద్‌కుమార్, మంగలి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుంటే ఆందోళనలు

వనపర్తి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఆందోళనలు చేపడుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ హెచ్చరించారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 421 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని.. రెండేళ్లయినా మహిళకు రూ.2,500, నిరుద్యోగ భృతి రూ.4,116, ఆసరా పింఛన్లు రూ.4,000, దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు, కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం, 18 ఏళ్ల నిండిన విద్యార్థినులకు ఉచిత స్కూటీ, జాబ్ క్యాలెండర్, ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయలేక ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని 10 శాతం ముస్లింలకు పంచుతామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు. రాబోవు బిహార్, ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓట్ల చోరీ పేరుతో కొత్త నాటకానికి తెరతీశారని, ఎన్నికల సంఘం అధికారికంగా ఫిర్యాదు చేయమంటే వెనక్కి తగ్గారని కాంగ్రెస్‌పార్టీని దేశ ప్రజలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు బాశెట్టి శ్రీనివాసులు, పద్మమ్మ, కె.శివారెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకం

ఖిల్లాఘనపురం: రాష్ట్ర అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పాత్రికేయుల భవనాన్ని ఆయన స్థానిక అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఎక్కడైన అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. అనంతరం మండల యువత ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మినీస్టేడియం ఏర్పాటుకు త్వరలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంటామని చెప్పారు. వివిధ పత్రికల్లో విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటుగా ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ రమేష్‌నాయుడు, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ సునీత, ఎస్సై నరేష్, ఏఓ మల్లయ్య, ఎంపీఓ రాజు, వైస్‌చైర్మన్ క్యామరాజు, సాయిచరణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి